

# టేక్ కేర్..!

- నగరంలో పడగ విప్పుతున్న క్యాన్సర్
- గుండెపోటు తర్వాత స్థానం క్యాన్సర్‌దే
- కాస్త ఆలోచించకపోతే ప్రమాదకర వ్యాధి రావొచ్చు..!

**హైదరాబాద్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త**

నగరంలో క్యాన్సర్ పడగ విప్పుతోంది. అభివృద్ధి చెందుతున్న సమాజంలో క్యాన్సర్ కల్లోలం సృష్టిస్తోంది. రోగనిరోధక శక్తి తగ్గేకొద్దీ క్యాన్సర్ విస్తరణ వేగమూ అదేస్థాయిలో పెరుగుతోంది. క్యాన్సర్ బారినపడ్డ తరువాత చికిత్స చేయడంకన్నా అది దరికిచేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడమే అత్యుత్తమమైన పని. జీవన పరిస్థితులు, వ్యక్తిగత పరిశుభ్రత, జీవనశైలి వంటివి ఆరోగ్యంపై ప్రభావం కనబరుస్తాయి. క్యాన్సర్ ముందుగా గుర్తించడం సాధ్యంకాదని ఇప్పటికే చాలా మంది అపోహపడుతుంటారు. అది ఎంతమాత్రమూ నిజంకాదని వైద్యులు పేర్కొంటున్నారు. చాలా రకాల క్యాన్సర్లను తొలిదశలోన్లేనే పసిగట్టవచ్చు. ప్రజల్లో అవగాహన పెరగడం నేటి తక్షణావసరం. కొన్ని రకాల క్యాన్సర్లను మాత్రం తొలిదశలోనే గుర్తించడం కుదరదు. రొమ్ము, గర్భాశయ, చర్మ, నోటి, పేగు సంబంధ క్యాన్సర్లను చాలా ముందుగానే గుర్తించడం సాధ్యమవుతుంది. లక్షణాల ప్రాతిపదికన ప్రాథమిక స్థాయిలోనే క్యాన్సర్‌ను గుర్తించినట్లయితే చికిత్స సులభమవుతుంది. మద్యపానం, పొగాకు సేవవనం వంటి అలవాట్ల వల్ల కలిగే దుష్ఫలితాలను విరివిగా ప్రచారం చేయడంతోపాటు పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవశ్యకత పట్ల అవగాహన పెంచితే క్యాన్సర్‌ను చాలా వరకు నిరోధించవచ్చు. ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడుతున్నవారిలో 71 శాతం ధూమపానం అలవాటు ఉన్నవాళ్లే. క్యాన్సర్ మరణాల్లో 22 శాతానికి పొగాకు సేవనమే కారణమవుతోంది. గుట్కా, పాన్ మసాలాలు, తంబాకు లాంటి వాటిని విచ్చలవిడిగా నమలడం..గంటల తరబడి నోట్లో పెట్టుకోవడంతో చాలా మందికి నోట్లో తీవ్రమైన అస్సర్లు కన్పిస్తున్నాయి. వీటిని నిర్లక్ష్యం చేయడంతో 2–5 ఏళ్లలో నోటి, హెడ్ అండ్ నెక్ క్యార్సర్ల కింద రూపాంతరం చెందే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అవగాహన లేమితో పొగాకు ఉత్పత్తులను వాడుతూ వారికి తెలియకుండానే బానిసలవుతున్నారు. ముఖ్యంగా బాధితుల్లో అధిక శాతం యువత ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి వచ్చే బాధితుల్లో 40 శాతం నోటి, హెడ్ అండ్ నెక్‌లతో బాధపడుతున్నారని అక్కడి వైద్యులు పేర్కొంటున్నారు. యువత ఎక్కువ మంది గుట్కా, పాన్ మసాలాలు,, జర్దా లాంటి వాటిని అధికంగా తీసుకుంటున్నారు. తక్షణం ఇలాంటి వాటిని మానేయడం చాలా మంచిదని, నోట్లో దీర్ఘకాలంగా పుండ్లు, తెల్లమచ్చలు లాంటివి ఉంటే నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. నోరు తెరవడం, గుటక వేయడం కష్టంగా ఉండటం, ఆహారం తీసుకుంటే మింగనివ్వకపోవడం, గొంతు బొంగురు పోవడం లాంటి లక్షణాలు కన్పిస్తే తక్షణం క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలంటున్నారు. ముందే గుర్తించడంతో నోటి క్యాన్సర్లను పూర్తిగా నివారించవచ్చు. చాలా మంది 2–3 దశలు దాటిన తర్వాత చికిత్సకు వస్తున్నారని, ఇలాంటి సమయాల్లో నియంత్రణ అనేది కష్టమని చెబుతున్నారు. సుదీర్ఘంగా పిప్పి పళ్లతో నోటి గోడలకు ఇన్‌ఫెక్షన్లు లాంటివి వస్తే అశ్రద్ధ చేయకూడదని వైద్యులు పేర్కొంటున్నారు. ఏటా ఈ మహమ్మారి కేసులు, మరణాలు చాప కింత నీరులా పెరుగుతున్నాయని ఆందోళన వెలిబుచ్చుతున్నారు. గాడితప్పిన జీవనశైలి కారణంగా కేసులు పెద్ద ఎత్తున నమోదవుతున్నాయని వివరిస్తున్నారు.

### 30ఏళ్ళ వారిని వదలని మహమ్మారి...

ప్రపంచంలో మరణాలకు దారితీసే అతి ముఖ్య కారణాల్లో గుండెపోటు తర్వాతి స్థానం క్యాన్సర్‌దే. గతంలో 50 ఏళ్ళు పైబడిన వారిలోనే ఎక్కువగా కనిపించేది. ప్రస్తుతం 30ఏళ్ళ వారిని వెన్నాడుతోంది. 30 నుండి 40 ఏళ్ళ వయస్సులో ఏటా 10శాతం కేసులు పెరుగుతుండటం ఆందోళన చెందాల్సిన అంశమే. దీని నివారణకు చర్యలు తీసుకోకుంటే 2025 నాటికి మొదటి స్థానానికి ఎగబాకే ప్రమాదం ఉందని డబ్ల్యూహెచ్‌వో హెచ్చరించింది. మన దేశంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కారక వైరస్ పెళ్ళీడుకొచ్చిన మహిళలందరిలోనూ ఉంటుంది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలో క్యాన్సర్‌గా రూపాంతరం చెందుతుంది. ముందే కనిపెట్టగలిగితే థర్మల్ క్రయోథెరఫీ వంటి సులువైన పద్ధతుల్లో నయం చేయవచ్చు. రొమ్ములో క్యాన్సర్ కణితిగా రూపాంతరం చెందడానికి ముణ్నాలుగేళ్ళు పడుతుంది. ఈ సమయంలో కనిపెట్టగలిగితే చికిత్స సులువవుతుంది. క్యాన్సర్ లక్షణాలను ముందస్తుగా గుర్తించడం ద్వారా ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధునాతన చికిత్సలో పూర్తిగా నయం చేయడానికి అవకాశాలు మెరుగయ్యాయి.

### ఆలస్యంతోనే అధిక మరణాలు...

హెపటైటీస్ బీ, సీలు కాలేయ క్యాన్సర్‌లకు, హ్యూమన్ పాపిలోమా వైరస్(హెచ్‌పీవీ) గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ రావడానికి కారణమవుతున్నాయి. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు టీకా అందుబాటులో ఉంది. 8 నుండి 18 ఏళ్ళ వయస్సు వారికి దీన్ని ఇవ్వాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తోంది. కాలేయ క్యాన్సర్‌కు హెపటైటీస్ టీకా ఉంది. 40 ఏళ్ళు దాటిన మహిళ ఏడాదికోసారి మామోగ్రఫీ, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలి. అత్యధికుల్లో క్యాన్సర్‌ను గుర్తించడమే ఆలస్యమవుతోంది. దాంతో అప్పటికే ముదిరిపోయి మరణాలకు దారితీస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం ఆధ్వర్యంలో విస్తృతంగా క్యాన్సర్ ముందస్తు పరీక్షలు నిర్వహిస్తున్నారు. క్యాన్సర్‌కు ప్రధాన కారణాలలో సిగరెట్, గుట్కా, తంబాకు వంటి పొగాకు ఉత్పత్తుల వాడకంతో పాటు మితిమీరిన మద్యపానం, ఊబకాయం, వేపుళ్ళు, నిల్వ ఆహారం ఎక్కువగా తీసుకోవడం, వ్యాయామం చేయకపోవడం, అధిక ఒత్తిడి, తీవ్ర నిద్రలేమిలని వైద్యులు పేర్కొంటున్నారు.

హైదరాబాద్ వార్త



# కీసరగుట్ట బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలి

**హైదరాబాద్ ఫిబ్రవరి2, ప్రభాతవార్తః**

మహాశివరాత్రి బ్రహ్మత్సవాలను పురస్కరించుకుని కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఈ విషయంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిచడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 16వ తేదీ నుండి 21వ తేదీ వరకు జరిగే బ్రహ్మత్సవాలకు సంబందించిన ఏర్పాట్లపై ఆలయంలోని కార్యాలయంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి, అభిషేక్ ఆగస్త్య జిల్లా అధికారులు, ఆలయ కమిటీలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్ధం ప్రత్యేక దర్శనం కల్పించేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం స్వామి వారి దర్శనానికి ప్రత్యేకంగా అన్‌లైన్ వెబ్‌సైట్ ఏర్పాటు చేసి వవారు కోరుకున్న రోజున సమయానికి శ్రీ రామలింగేశ్వర స్వామి దర్శనం కలుగుతుందని మంత్రి వివరించారు. ఆన్‌లైన్ టికెట్లు బుక్ చేయడం ఇది మొదటిసారి అని దీనిని ద్వారా తమ టికెట్లు బుక్ చేసుకున్న భక్తులకు ఒక్కొక్కరికి రూ 500 చొప్పున టిక్కెట్లో దర్శనం కల్పించడం జరుగుతుందరి దీంతో పాటు ఆన్‌లైన్ దర్శనానికి బక్ చేసుకున్న భక్తులకు ఆర్జిత సేవలు, అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు కూడా చేయడం జరుగుతుందని తెలిపారు. మహాశివరాత్రి జాతర సమయంలో శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి దర్శనానికి ఎలాంటి పాసులు, విఐపిలకు సంబందించిన లెటర్లు అనుమతించబడవని ఈ విషయంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. కీసరగుట్టకు వచ్చే వృద్దులు, చిన్నపిల్లలకు వెంటనే ప్రత్యేక దర్శనం కల్పించడం జరుగుతుందని దీనికి క్యాలైన్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గత రెండేళ్ల క్రితం కరోనా సమయంలో ఎక్కువ భక్తులు రాలేదని ప్రస్తుతం పరిస్దితులని బాగున్నందున మహాశివరాత్రి జాతరకు కీసరగుట్టకు లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని దీనిని దృష్టిలో పెట్టుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాల్సిందిగా మంత్రి ఆదేశించారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యదాయుతంగా వ్యవహరించాలని ఏ మాత్రం లోటుపాట్లు, పొరపాట్లు జరుగకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. మహాశివరాత్రితో పాటు అంతకు ముందు తర్వాత రోజుల్లో సైతం భక్తులు ఎక్కువగానే వస్తారని దీనిని దృష్టిలో ఉంచుకుని ఆలయ సిబ్బంది సైతం ఎక్కువ మందికి స్వామి వారి దర్శనం కలిగేలా చూడాల్సిందిగా మంత్రి సమావేశంలో సూచించారు. అలాగే జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లవసరమైన చర్యలు తీసుకోవవాలని ఈ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మహాశివరాత్రి జాతరను విజయవంతం చేయాలని మంత్రి కోరారు. జాతర రోజుల్లో కీసర ఆలయం వద్ద వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. అలాగే జాతరలో పరిశుభ్రత ఉండాలని దీని కోసం జిల్లా పంచాయతీ శాఖ ఆద్వర్యంలో ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులను నిర్వహించడంతో పాటు ఎక్కడా అపరిశుభ్రత లేకుండా చూడాల్సిన బాధ్యత తీసుకోవాలని తెలిపారు. దీంతో పాటు జాతరలో భక్తులకు నీటి సౌకర్యం ఉండేలా ఆయా చోట్ల మంచినీటి సౌకర్యం త్రాగు నీటి వసతి కల్పించాలని ఈ విషయంలో సంబందిత శాఖ అధికారులు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జాతరకు ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి తొక్కిసలాట ఇబ్బందులు తలెత్తకుండా బ్యారికెడ్లు ఏర్పాటు చేయాలని జాతర సమయంలో కరెంట్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు ఇప్పటి నుంచే చేసుకోవాల్సిందిగా సూచించారు. దీంతో పాటు అన్ని శాఖల జాతరలో ఏమైనా అవసరాలు, ఇబ్బందులు ఉంటే ఇప్పటి నుంచే వాటిని సరిచేసుకోవాలని తెలిపారు. మహాశివరాత్రి జాతరకు రామలింగేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు చేస్తున్న క్యూలైన్‌లలో భక్తులు ఎక్కువ సంఖ్యలో దర్శించుకునేలా ఏర్పాట్లు చేయాల్సిందిగా జాతరలో సరుకులు ఇతర స్టాల్స్‌తో పాటు భక్తులకు అవసరమైన మేర టాయిలెట్లు ఉండేలా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ ఆలయం హైదరాబాద్ నగరానికి దగ్గరలో ఉన్న శేవక్షేత్రమని మహాశివరాత్రి పండుగను హైదరాబాద్ ఇతర జిల్లాలతో పాటు పెద్ద ఒఖ్యలో వస్తారని దీనిని దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేయాలని అన్నారు. శివరాత్రికి ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించే విషయంలో ప్రతి ఒక్కరూ కృషి చేసి విజయవంతం చేయాలని తెలిపారు. దీనికి ప్రజాప్రతినిధులు, అదికారులు పరస్పరం సహకారంతో చేస్తే ఇబ్బందులు తలెత్తకుండా జాతరను విజయవంతం చేద్దామని పేర్కొన్నారు. ప్రస్తుతం భక్తుల సౌకర్యార్ధం నూతనంగా కల్పించిన ఆన్‌లైన్ విదారం ఎంతో మంచిదని దీని ద్వారా భక్తులు వారు కోరుకున్న సమయానికి స్వామి వారి దర్శనంతో పాటు పూజలు కూడా చేయడం అభినందనీయమని తెలిపారు. కీసరగుట్టలో భక్తులకు కలుగకుండా పారిశుద్ద్య సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి, అభిషేక్ అగస్త్య, ఆర్‌డిఓ రవి, డిఏస్పి జాకరీ ధరావత్, జడ్పి వైస్ చైర్మన్ వెంకటేష్, ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ, సర్పంచ్ మాధురి, ఈఓ సుధాకర్‌రెడ్డి, జిల్లా స్దాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

# సాఫ్ట్‌వేర్ ఇంజనీరు ఇంట్లో భారీ చోరీ

**ఏడు లక్షల నగదుతో సహ 10తులాల బంగారం చోరీ**

**బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి పోలీసులు**

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త**

నూతన గృహ ప్రవేశానికి ముందు ఇంట్లో దాచివుంచిన ఏడు లక్షల నగదుతో పాటు సుమారు పదితులాల బంగారు ఆభరణాలు దోపిడీకి గురైన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతల్‌లో చోటుచేసుకుంది పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చింతల్ శివనగర్‌కు చెందిన మనోహార్ సాఫ్ట్‌వేర్‌లో ఉద్యోగం చేస్తూ చింతల్ శివనగర్‌లో నివాసముంటున్నాడు. మనోహర్ ఇటీవల దుండిగల్ పరిధిలోని బహదూర్‌పల్లిలో నూతనంగా ఇంటిని నిర్మించుకుని గృహప్రవేశం నిమిత్తం వెళ్లాడు. మంగళవారం ఇంటి నుండి కుటుంబంతో సహ బయలుదేరి బుధవారం సాయంత్రం ఇంటికి తిరిగివచ్చాడు. ఈ సమయంలోనే ఇంటిని గుర్తించిన గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో చొరబడి ఇంట్లో దాచివుంచిన నగలు, నగదును పూర్తిగా దోచేశారు. గృహప్రవేశం అనంతరం మనోహర్ చింతల్‌లోని తన పాత ఇంటికి వచ్చిచూడగా ఇళ్లు మొత్తం చిందర, బందరగా కనిపించింది. వెంటనే బీరువావైపు చూడగా తెరిచి వుండటంతో పాటు బీరువాలో గల ఏడు లక్షల రూపాయల నగదుతోపాటు పది తులాల బంగారు ఆభరణాలు దోపిడీకి గురైనట్లు గుర్తించి వెంటనే పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. చుట్టుపక్కలవారితో విచారణ ప్రారంభించి వివిధ కోణాలల్లో పరిశీలిస్తున్నారు. చుట్టుపక్కల కాలనీలతో పాటు సిసి కెమెరా పుటేజీలను పరిశీలిస్తూ అనుమానితులకోసం పోలీసులు గాలింపును ముమ్మరంచేశారు.

## హనుమాన్ టెంపుల్ వద్ద బోర్ వేయించిన ఎమ్మెల్యే



హనుమాన్ టెంపుల్ వద్ద స్వంత ఖర్చుతో బోర్ వేయిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త**

గోల్నాక డివిజన్, మారుతినగర్‌లోని హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తన స్వంత ఖర్చుతో బోర్ వేయించారు. గురువారం భక్తుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి బోర్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ ఆలయంలో నీటికి ఇబ్బందిగా ఉందని భక్తులు, కమిటీ సభ్యులు తన దృష్టికి తెచ్చారని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు ఉండకూడదని వెంటనే తన స్వంత ఖర్చుతో ఈ పనులను ప్రారంభంచినట్లు చెప్పారు. దైవకార్యంలో పాల్గొనడం తనకు ఎంతో సంతోషంగా ఉందని, ఆలయానికి ఇతర సౌకర్యాలు కావాలన్నా ఏర్పాటు చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు, బస్తీవాసులు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సిలిండర్ గ్యాస్‌లీకై కుత్బుల్లాపూర్‌లో అగ్నిప్రమాదం

**వృద్ధుడికి తీవ్రగాయాలు**

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త**

ఇంట్లో ఎవరూలేని సమయంలో గ్యాస్ సిలిండర్ పిన్‌మార్చి వంటకు ఉపక్రమిస్తున్న సమయంలో ఒక్కసారిగా గ్యాస్ లీక్ అయ్యి ఓ వృద్దుడు తీవ్రగాయాలకుగురైన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కుత్బుల్లాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల సమపంలో గల హప్పినెస్ట్ ఆపార్ట్‌మెంట్‌లో నివాసముండే సంతోషిని చూసేందుకు మెడ్చెల్‌లోని కెఎల్‌ఆర్ కాలనీలో నివాసముండే లక్ష్మయ్య (70)వచ్చాడు. కూతురుకి సిలిండర్ మార్చేపైప్‌మార్చేవిషయంలో సహాయం చేద్దామనే ఉద్దేశంతో సిలిండర్ పైప్‌మార్చాడు. అయితే మార్చిన పైప్ సరిగా పట్టకపోవడంతో గ్యాస్ లీక్‌కావడం మొదలైంది. ఇదిగమనించని లక్ష్మయ్య ఇంట్లో దీపం ముట్టించేందుకు అగ్గిపెట్టెతో గీకటంతో ఇళ్లంతా వ్యాపించిన గ్యాస్ ఒక్కసారిగామంటలను అంటుకుని ఇళ్లు పెద్దఎత్తున అగ్ని ఇళ్లంతా అంటుకుంది. ఇది గమనించిన కూతురు సంతోషి వెంటనే బయటకు పరుగులుతీసి ప్రాణాలు కాపాడుకోగలిగింది. పోసులకు సమాచారం అందించటంతో పోలీసులు తీవ్రగాయాలకు గురైన లక్ష్మయ్యను ఆసుపత్రికి తరలించారు. సుమారు 60శాతం కాలిన గాయాలతో ఆసుపత్రిలో లక్ష్మయ్య చావుబతుకుల మధ్య చికిత్సపొందుతున్నాడు. కుటుంబ సభ్యులు సంతోషి ఫిర్యాదుమేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తుచేస్తున్నారు.

# ఏ కళ అయినా ఒక్కప్రాంతానికే సొంతం కాదు

**-డా. సముద్రాల వేణుగోపాలాచారి**

**-ఆసక్తికరంగా సాగుతున్న హరికథ మహోత్సవ వారోత్సవాలు**

**రవీంద్రభారతి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :**

హరికథలు, బుర్రకథలు, యక్షగానాలు ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర ప్రాంతంలో చాలా ప్రసిద్ధిగాంచినవని, కొత్త రాష్ట్రమైన తెలంగాణలో కూడా మేమూ హరికథను చెప్పగలమని ముందుకొచ్చిన అద్భుతంగా హరికథా గానం చేయడం శ్లాఘనీయమని, ఏ కళ అయినా ఒక్క ప్రాంతానికే సొంతం కాదన్న తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డా. సముద్రాల వేణుగోపాలాచారి నేడు పార్వతీ కళ్యాణం హరికథగానం చేస్తున్న భాగవతారిణి ఆర్. రేఖను అభినందించారు. తెలుగుభాషా, సంస్కృతులను పెంపొందించే విధంగా నేడు కనుమరుగవుతున్న హరికథా గాన కళను ప్రోత్సహిస్తూ వచ్చేతరాలకి అందించి వాటి ప్రాముఖ్యతను చెప్పేందుకు డా. కె.వి.రమణాచారి జన్మదినోత్సవం సందర్భంగా హరికథ మహోత్సవ వారోత్సవాలను మహోన్నతంగా నిర్వహిస్తున్న రఘురామ్‌ను ఆయన అభినందించారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో రవీంద్రభారతి ప్రాంగణంలోని ఘంటసాల కళావేదికలో వారంరోజులపాటు ప్రతీరోజూ రాత్రి 6గంటల నుండి జరిగే హరికథా మహోత్సవ వారోత్సవాలు బుధవారం రాత్రి వైభవోపేతంగా ప్రారంభమైన విషయం మా పాఠకులకు విదితమే. ఈ మహోత్సవ రెండవరోజు గురువారం రాత్రి మద్దాళి రఘురామ్ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డా. సముద్రాల వేణుగోపాలాచారి విచ్చేసి విశిష్ట అతిథి డా. కె.వి.రమణాచారి తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి హరికథా మహోత్సవ వారోత్సవ రెండవరోజు కార్యక్రమాలను ప్రారంభించి నేడు హరికథా గానం చేస్తున్న శేర్‌లింగంపల్లికి చెందిన భాగవతారిణి ఆర్. రేఖను ఘనంగా సత్కరించారు. సభానంతరం భాగవతారిణి ఆర్. రేఖ రవీంద్రభారతి ఘంటసాల ప్రాంగణంలోని ఆహ్లాదకరమైన వాతావరణంలో పార్వతీ కళ్యాణం హరికథా గానం కావించి విచ్చేసిన ప్రేక్షకులకు శ్రవణానందం కలిగించారు. రేపు 3వరోజు శుక్రవారం రాత్రి హరికథా మహోత్స వ వారోత్సవాల్లో మదనపల్లికి చెందిన భాగవతారిణి గరిమెళ్ళ సత్యవతిచే విరాటపర్వం హరికథాగానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.





ప్రముఖ హరికథా భాగవతారిణి ఆర్. రేఖను సత్కరిస్తున్న వేణుగోపాలాచారి, రమణాచారి, రఘురామ్ తదితర అతిథులు

## పేదల కోసమే నాయిని నరసింహారెడ్డి ఫౌండేషన్

**జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యులు శ్రీనివాసరెడ్డి**

**ధర్నాచౌక్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:**

పేదలకు సహాయ సహకారాలు అందించటమే నాయిని నరసింహారెడ్డి ఫౌండేషన్ లక్ష్యమని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యులు, రాంనగర్ మాజీ కార్పొరేటర్, నాయిని నరసింహారెడ్డి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం బర్కత్‌పురాలోని నాయిని నరసింహారెడ్డి ఫౌండేషన్ కార్యాలయం వద్ద రాంనగర్ డివిజన్‌కు చెందిన సరోజ అనే మహిళకు చెత్త సేకరించే రిక్షా ఆయన అందచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సరోజా అనే మహిళ ఇండ్లలో చెత్త సేకరిస్తూ జీవనోపాధి పొందుతూ ఉందని, ఇటీవల ఆమె రిక్షా పూర్తిగా పాడవటంతో ఆమె ఉపాధి ప్రశ్నార్ధకంగా మారిందని అన్నారు. సరోజ రిక్షా గురించి స్థానికులు మాదృష్టికి తీసుకురావటంతో విషయం తెలిసిన నాయిని నరసింహారెడ్డి గారి మనవళ్లు అంకుష్‌రెడ్డి, ధనుష్‌రెడ్డిలు సరోజకు కొత్త రిక్షా ఇవ్వాలంటూ వారి పాకెట్ మనీ సైతం నాయిని నరసింహారెడ్డి ఫౌండేషన్‌కు ఇచ్చారని తెలిపారు. నాయిని నరసింహారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్త రిక్షా తయారు చేయించి సరోజకు ఇవ్వటం జరిగిందని పేర్కొన్నారు. తన ఉపాధి పోతుందని బాధపడుతూ ఎంతో మందిని అభ్యర్థించినప్పటికీ, ఎవరి నుండీ సాయం అందలేదని, నాయిని ఫౌండేషన్ ద్వారా తనకు రిక్షా ఇచ్చి, తన ఉపాధిని నిలబెట్టినందుకు సరోజ నాయిని ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలియచేసింది. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సిరిగిరి శ్యాం, కిరణ్, కార్తీక్ యాదవ్, సత్యనారాయణ, సద్దిఖీ, అరుణ్, వెంకటేష్, రాజు, అజ్జు, సాయి యాదవ్, కల్పన, ఎలిజబెత్, సాలమ్మ, తిరుమల, సబిత, రేణుక, రాజేష్, మహేందర్ మరియు నాయిని నరసింహారెడ్డిగారి మనవళ్లు అంకుష్‌రెడ్డి, ధనుష్‌రెడ్డి పాల్గొన్నారు.





సరోజకు రిక్షా అందచేస్తున్న వి.శ్రీనివాసరెడ్డి తదితరులు

## కేంద్ర బడ్జెట్ పేద, మధ్య తరగతి ప్రజలకు వ్యతిరేకంగా ఉంది

**ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ ధ్వజం**

**సైఫాబాద్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద ప్రజలకు వ్యతిరేకంగా కార్పోరేట్ సంస్థలు, బడా వ్యాపారస్తులకు భరోసా ఇచ్చేవిధంగా ఉందని పేద, మధ్యతరగతి ప్రజల అశలను అడియాశాలు చేశారని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్ ఆరోపించారు. దేశ ప్రజలపై లక్షల కోట్ల రూపాయలు అప్పులు తెచ్చిన కేంద్రం ఈ బడ్జెట్‌లో కనీసం అప్పులు తగ్గించుకునేందుకు ఏలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. 2023–24 బడ్జెట్‌లో ప్రాథమిక విద్య, ఉన్నత పాఠశాల విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేసి విదేశీ విద్యావిధానాన్ని, యూనివర్సిటిలను భారతదేశంలో స్థాపించేందుకు బడ్జెట్‌లో ఆర్థిక శాఖ మంత్రి తహతహలాడటం విచారకరమన్నారు. పెట్రోల్, డిజీల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించేందుకు ఏలాంటి చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. బడ్జెట్‌లో ఒక్క నెలలోనే లక్షా 56 వేల కోట్ల రూపాయలు జిఎస్టీ ట్యాక్స్ ద్వారా కేంద్రానికి అదాయం వచ్చినట్లుగా ప్రకటించినప్పటికి పెట్రోల్, డిజీల్, గ్యాస్ ధరలు తగ్గించేందుకు ప్రయత్నం చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. లక్షల కోట్లు అప్పులను, వడ్డీలను తగ్గించుకునేందుకు ఒక శాతం జనాభా కలిగిన కోటీశ్వరుల నుంచి వారి ఆదాయంపై పన్ను వేయడం ద్వారా ప్రభుత్వ అప్పులను తగ్గించుకునే అవకాశం ఉన్నప్పటికి పేద ప్రజలపైనే ఈ బడ్జెట్ ప్రభావం దారుణంగా ఉందన్నారు. బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజల ఇబ్బందులను మరిచిపోయిందని నిరుద్యోగ నిర్మూలన, అనారోగ్యంపై చర్యలు, ప్రాథమిక నుంచి ఉన్నత విద్య వరకు ఉచిత ప్రవేశపెట్టకపోవడం పేద, మధ్య తరగతి ప్రజలను మరింతగా ఆందోళనకు గురిచేసిందన్నారు. ప్రపంచ ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దిగజారుతున్న ఈ తరుణంలో ఈ బడ్జెట్ పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతమాత్రం ప్రయోజనం లేదన్నారు. ఇప్పటికైనా కేంద్రం మరోకసారి బడ్జెట్‌పై వరిశీలించి పేద, మధ్య తరగతి ప్రజలకు అనుకూలంగా మార్పులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో కోట్లాది మంది కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా చేసినందుకు కేంద్ర ప్రభుత్వంపై పోరాటాలు, ఉద్యమాలు కొనసాగుతున్న పట్టించుకోలేదని బాల్‌రాజ్ ధ్వజమెత్తారు.

### 5న 10వ తరగతి గణితంలో ఉచిత నమూనా పరీక్ష

**హైదరాబాద్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** పదో తరగతి గణితం ఉచిత నమూనా పరీక్షను ఈనెల 5న పద్మారావునగర్‌లోని శ్రీసాయి విజ్ఞానభారతి కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి తెలిపారు. నగరంలోని ఏ పాఠశాల విద్యార్థులైన ఈ పరీక్ష రాయవచ్చని తెలిపారు. మూడు గంటల ఈ పరీక్షలో స్టేట్ ఎస్‌ఎస్సీ బోర్డు సూచించిన రీతిలోనే ఒకే ప్రశ్నపత్రం ఉంటుందని తెలిపారు. అధిక మార్కులతో తొలి మూడు స్థానాలలో నిలిచే విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రతి పాఠశాలకు అవార్డును సైతం అందజేయనున్నట్లు వివరించారు. ఉత్తమ విద్యార్థులకు తమ కళాశాలలో ఉచితంగా అడ్మిషన్లు అందిస్తామన్నారు. వివరాలకు తమ కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపల్ రమాదేవి కోరారు.



అమీర్‌పేట్‌లో జరిగిన ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్, నటి సలోని

